సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 24 । మార్చి । 2023



చాట్ బాక్స్‌తో సులువైన సేవలు

ప్రజలకు సులువైన సేవలు అందించడానికే చాట్ బాక్స్‌ ప్రారంభించామని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. -8లో..

భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవం



గర్భిణీ అయిన భార్యను రోకలి బండతో కొట్టి హత్య చేసిన భర్త సయ్యద్ హుస్సేన్‌కు కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. -8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.6/25.6

జిల్లాలో గురువారం 25.6 – 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్



న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప స్పోర్ట్స్: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్–2023కు సంబంధించి ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ తెలిపారు. పూర్తి వివరాలు అగ్నిపథ్ వాయు.సీడీఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డెమో రైలు నెలాఖరు వరకు రద్దు



కడప కోటిరెడ్డిసర్కిల్: నంద్యాల–కడప–నంద్యాల మధ్య తిరుగుతున్న నంద్యాల డెమో రైలు (07284/85) ఈనెల 31వ తేదీ వరకు రద్దు చేశామని కడప రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ రైలు నిర్వహణతోపాటు వసతుల ఆధునీకరణ కోసం తాత్కాలికంగా రద్దు చేశామన్నారు. ప్రయాణీకులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

26న వైవీయూలో సాఫ్ట్ బాల్, లాన్‌టెన్నిస్ పోటీలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 26 తేదీన వైవీయూ అంతర్ కళాశాలల సాఫ్ట్‌బాల్, లాన్‌టెన్నిస్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డా. కె. రామసుబ్బారెడ్డి తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి మహిళలు, పురుషుల విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2022 జూలై 1 నాటికి 17 సంవత్సరాలు నిండి 27 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారు పోటీలకు అర్హులన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఎలిజిబిలిటీ ఫాంలు, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. విజేతలకు నగదు బహుమతి ఉంటుందని తెలిపారు.

26న అండర్–17 టెన్నిస్ బాల్ క్రికెట్ ఎంపికలు

బద్వేలు అర్బన్ : కడప, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన అండర్–17 టెన్నిస్‌బాల్ క్రికెట్ ఎంపికలు ఈ నెల 26వ తేదీన మైదుకూరులోని మేధా డిఫెన్స్ అకాడమీలో జరగనున్నట్లు టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వై.సుబ్బయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటల లోపు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డుతో హాజరుకావాలని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలలో రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. 2006వ సంవత్సరం జనవరి 1వ తేదీ లోపు జన్మించిన వారు మాత్రమే ఎంపికలకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 93986 35927, 76598 47184 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సమస్యలను సత్వరం పరిష్కరించాలి

కడప కార్పొరేషన్: విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. మునిశంకరయ్య ఆదేశించారు. గురువారం 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో భాగంగా ఆయన ఫోన్ ద్వారా వినియోగదారుల సమస్యలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ వేసవి కాలం మొదలైనందున విద్యుత్ పొదుపు పాటించాలని సూచించారు. సంస్థ అభివృద్ధికి విద్యుత్ బకాయిలను ఎప్పటికప్పుడు చెల్లించాలని వినియోగదారులను కోరారు. విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు ఇటు అధికారులు, సిబ్బంది, ప్రజలు సంయుక్తంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ పి. సుబ్రమణ్యం, జేఈ జి. లావణ్య పాల్గొన్నారు.

హెచ్ఎన్ఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్‌గా సందీప్ కుమార్

రాయచోటిటౌన్ : హంద్రీనీవా సుజల స్రవంతి మదనపల్లె డివిజనల్ డిప్యూటీ కలెక్టర్‌గా కిడారి సందీప్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అన్నమయ్య జిల్లా పరిధిలోని హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 డిప్యూటీ కలెక్టర్‌గా త్వరలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

అమ్మాయిలు అదుర్స్

అమ్మాయిలే.. కానీ ఆటలోకి దిగితే ప్రత్యర్థికి చుక్కలు చూపిస్తారు.. తమదైనశైలిలో మెరుపువేగంతో ముందుకు సాగుతూ ప్రత్యర్థులను తికమకపెట్టి.. గోల్ సాధిస్తారు.. తద్వారా జిల్లా జట్టును ఆంధ్రప్రదేశ్‌లోనే అగ్రస్థానంలో నిలపడంతో పాటు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఆంధ్రా జట్టులో అరడజన్ మంది కడప జిల్లా జట్టుకు చెందిన వారే ఉండటం విశేషం. కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలకు చెందిన నలుగురు క్రీడాకారిణులతో పాటు మరో ఇద్దరు పూర్వ విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఫుట్‌బాల్ క్రీడలో రాణిస్తున్న క్రీడాకుసుమాలపై ప్రత్యేక కథనం..



జిల్లా ఫుట్‌బాల్‌జట్టును అభినందిస్తున్న వైఎస్ఆర్ క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామొహిద్దీన్

- జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఆరుగురు ఎంపిక
- నలుగురు క్రీడాపాఠశాల క్రీడాకారిణిలు, మరో ఇద్దరు పూర్వ విద్యార్థులు

కడప స్పోర్ట్స్ : విశాఖపట్నంలో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన 2వ ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఉమెన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లా మహిళల జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు జట్టుపై 7–0 తేడాతో విజయం సాధించి చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. దీంతో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. చిత్తూరు జిల్లా పుత్తూరు పట్టణంలో ఈనెల 22వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ క్యాంపు నిర్వహించి ఏపీ తుది జట్టును ప్రకటించారు. ఈ జట్టులో వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి ఆరుగురు క్రీడాకారిణిలు చోటు దక్కించుకోవడం విశేషం. వీరు ఈనెల 25 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు గోవాలో నిర్వహించనున్న జాతీయస్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో వీరు పాల్గొననున్నారు. కాగా వీరంతా వైఎస్ఆర్ క్రీడాపాఠశాల ఫుట్‌బాల్ శిక్షకుడు హరి ఆధ్వర్యంలో శిక్షణ పొందడం గమనార్హం.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారు:
కె. వెన్నెల, టి. అరుణ, ఎల్.శృతి, కె. అనురాధ, కె. దుర్గ (పూర్వ విద్యార్థి) వి.శ్రీదేవి (పూర్వ విద్యార్థి).

▶▶ అనురాధ.. అదరహో..



వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అనురాధ స్వస్థలం విశాఖపట్నం. గేమ్‌లో మిడ్ ఫీల్డర్‌గా రాణిస్తున్న ఈమె ఇప్పటి వరకు సుబ్రతో ఫుట్‌బాల్ నేషనల్స్, రిలయన్స్ సౌత్ జోన్ నేషనల్స్‌లో రాణించింది. తాజాగా గోవాలో నిర్వహించే జాతీయస్థాయి సీనియర్ విభాగం పోటీలకు తొలిసారి ఎంపికైంది.

▶▶ వాల్ లా... వెన్నెల..



కడప నగర పరిధిలోని ఇందిరానగర్‌కు చెందిన కె. వెన్నెల వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ప్రత్యర్థులకు పాయింట్లు ఇవ్వకుండా గోల్‌కీపర్‌గా చక్కటి ప్రతిభ కనబరుస్తూ రాణిస్తోంది. ఇప్పటి వరకు ఎస్‌జీఎఫ్ అండర్–14, అండర్–17 పోటీల్లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది.

▶▶ అరుణ.. కిరణం



వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో 9వ తరగతి చదువుతున్న టి.అరుణ స్వస్థలం విశాఖపట్నం జిల్లా దేవరపల్లి. గేమ్‌లో చక్కటి స్ట్రైకర్‌గా పేరున్న ఈమె ఇప్పటి వరకు సుబ్రతో ఫుట్‌బాల్ నేషనల్స్, రిలయన్స్ సౌత్‌జోన్ నేషనల్స్‌లో రాణించింది. తాజాగా గోవాలో నిర్వహించే జాతీయస్థాయి సీనియర్ విభాగం పోటీలకు ఎంపికైంది.

▶▶ లయ తప్పని 'శృతి'...



వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎల్. శృతి స్వస్థలం నెల్లూరు నగరం. చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయినా మొక్క ఓని దీక్షతో క్రీడల్లో రాణిస్తోంది. ఇప్పటి వరకు సుబ్రతో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్, రిలయన్స్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లలో పాల్గొని రాణించింది. జట్టులో మిడ్ ఫీల్డర్‌గా రాణిస్తున్న ఈమె తొలిసారిగా జాతీయస్థాయి సీనియర్ మహిళల విభాగం పోటీలకు ఎంపికకావడం విశేషం.

టాలెంట్ హంట్



మనదేశంలో క్రికెట్‌కు ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు.. పురుషుల క్రికెట్‌తో పాటు మహిళల క్రికెట్‌కు సైతం క్రమేణా ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో మహిళా క్రీడాకారిణుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు భారత క్రికెట్ దిగ్గజాలు రంగంలోకి దిగాయి. భారత ఇండియన్ మాజీ కెప్టెన్ రవిశాస్త్రి నేతృత్వంలోని బృందం ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు టాలెంట్ హంట్ నిర్వహిస్తున్నారు.

- మహిళా క్రికెటర్లకు భలేచాన్స్
- ఎంపికైతే మూడేళ్ల పాటు శిక్షణ
- స్కాలర్‌షిప్ సౌకర్యం
- రేపు కడప నగరంలో ఎంపికలు

కడప స్పోర్ట్స్: భారత దిగ్గజ క్రీడాకారులైన రవిశాస్త్రి, బి.అరుణ్‌కుమార్, ఆర్. శ్రీధర్‌ల నేతృత్వంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న బియాండ్ క్రికెట్ అకాడమీలో ప్రవేశాల కోసం టాలెంట్ హంట్ నిర్వహించనున్నారు. హిందూస్థాన్ యూనివర్ లిమిటెడ్ సంస్థ సహకారంతో ఎంపికైన క్రీడాకారిణులకు మూడు సంవత్సరాల పాటు స్కాలర్‌షిప్‌తో పాటు ప్రత్యేక శిక్షణ, భోజనం, వసతి సౌకర్యాలు కల్పించి అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్‌లో మెలకువలు నేర్పుతారు. ఈ అకాడమీలో ప్రవేశాల కోసం ఈనెల 25వ తేదీన కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో ఎంపికలు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 65 మందిని ఎంపిక చేసి, వీరికి ప్రాక్టీస్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మ్యాచ్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 25 మందిని అకాడమీకి ఎంపిక చేసి వారికి అన్ని సౌకర్యాలు, స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

- వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో మహిళల క్రికెట్ అకాడమీకి సంబంధించిన ఎంపికలు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారిణులు 25వ తేదీ ఉదయం 8.15లోపు మైదానానికి చేరుకోవాలని సూచించారు. పోటీలో పాల్గొనదలచిన క్రీడాకారిణులు క్రికెట్ యూనిఫాం, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు.

25న వైఎస్సార్ ఆసరా నిధుల జమ

వీసీ ద్వారా నిధులను విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైఎస్సార్ ఆసరా మూడవ విడత నిధులను ఈనెల 25వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నారని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ తెలిపారు. రూరల్‌కు సంబంధించి 21,058 మహిళా సంఘాల్లోని 2,05,840 మంది సభ్యులకు లబ్ధి చేకూరేలా రూ. 172.24 కోట్లు, అర్బన్‌కు సంబంధించి 9491 మహిళా సంఘాల్లోని 94,910 మంది అక్కాచెల్లెమ్మలకు లబ్ధి చేకూరేలా రూ. 83.44 కోట్లు జమ చేయనున్నారు. మొత్తం కలిపి వైఎస్సార్ జిల్లాలో మూడవ విడత ఆసరా 30,549 మహిళా సంఘాల్లోని 3,00,750 మందికి లబ్ధి చేకూరేలా రూ. 255.68 కోట్లు నేరుగా మహిళా సంఘాల పొదుపు ఖాతాలలో మార్చి 25 నుంచి ఏప్రిల్ 5వ తేది వరకు జమ చేస్తామన్నారు.

ఆలయంలో గంట గంటకూ శ్లోకం

జిల్లాలో తొలిసారిగా పర్లపాడులో ఏర్పాటు

రాజుపాళెం : హిందూ దేవాలయాల్లో ప్రతి గంట గంటకు సమయాన్ని తెలపడంతోపాటు శ్లోకాలను చెప్పే యంత్రం వచ్చింది. ఆ యంత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి సారిగా వైఎస్సార్ జిల్లా రాజుపాళెం మండలంలోని పర్లపాడు గ్రామంలో, కమలాపురం మండలంలోని చదిపిరాళ్ల గ్రామంలో ఏర్పాటు చేశారు. సమయం గంట కాగానే ఉదయం పూట శ్లోకాలు, సాయంత్రం పూట సుందరకాండ వచ్చేలా ఆ యంత్రంలో ఏర్పాటు చేశారు. చెన్నై నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి ఆ యంత్రాలను తెప్పించినట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. యంత్రాన్ని పర్లపాడు గ్రామంలోని కోదండ రామాలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని గురువారం ప్రారంభించినట్లు గ్రామస్తులు చెప్పారు. దీంతో ఆ గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గంట గంటకు సమయంతోపాటు శ్లోకాలను చెప్పే యంత్రం

కడప మాస్టర్ ప్లాన్‌పై గెజిట్ నోటిఫికేషన్ విడుదల

కడప సెవెన్‌రోడ్స్ : అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఉన్న కడప నగర పాలక సంస్థ మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. నూతన మాస్టర్ ప్లాన్‌లో నగరంలోని రహదారులు, భవనాలు ఎంతమేరకు వెడల్పు ఉండాలో పొందుపరిచారు. కడప నగరాన్ని సమీపంలోని గ్రామాలను మాస్టర్ ప్లాన్ పరిధిలోకి తీసుకు వచ్చారు. నిర్ధారించిన మాస్టర్ ప్లాన్‌ను ప్రజల పరిశీలన కోసం కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, అనుడ పరిధిలోని గ్రామాల్లో ప్రదర్శించాలని జీఓలో పేర్కొన్నారు. నివాస, వాణిజ్య ప్రాంతాలు, మిక్స్‌డ్ జోన్లు, పారిశ్రామిక జోన్; సెమీ, సెమీ పబ్లిక్ జోన్ తదితర కేటగిరీలుగా విభజిస్తూ మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచారు.

విద్యార్థుల్లో నైపుణ్య అభివృద్ధికి కృషి

చిత్రలేఖనం ఫలితాలను విడుదల చేసిన డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో నైపుణ్య అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ రాఘవరెడ్డి సూచించారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ నిర్వహించిన డ్రాయింగ్ పోటీల ఫలితాలను గురువారం డీఈఓ విడుదల చేశారు.

సీనియర్ విభాగంలో.....
పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి, ముద్దనూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సాయిసుధా, పెండ్లిమర్రి మండలం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విజయహరి ప్రియాంకలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజయం సాధించారు.



ఫలితాలను డీఈఓకు అందచేస్తున్న న్యాయ నిర్ణేతలు


జూనియర్ విభాగంలో...
చెన్నూరు మండలం చిన్నమాచుపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన హాసిని, పొద్దుటూరు వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్‌కు చెందిన పుష్పలత, కడప చెమ్మియాపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సుజనలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. న్యాయనిర్ణేతలుగా కడప ప్రభుత్వ పురుషుల కళాశాల అధ్యాపకులు పత్తి వెంకట క్రిష్ణారెడ్డి, బయపురెడ్డి, రాఘవేంద్ర వ్యవహరించారు.

కనుమరుగైన పెద్దరికం

- రాయలసీమ ఉద్యమాలకు కేరాఫ్ అడ్రస్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి
- 'సెవెన్‌రోడ్స్ జంక్షన్' శీర్షికన ప్రత్యేక కథనాలు
- నేడు కోరుగుంటపల్లెలో అంత్యక్రియలు

సాక్షి ప్రతినిధి, కడప: జర్నలిజం రంగంలో ఆయన సవ్యసాచి. ప్రజలు, ప్రజాహక్కులు, రాయలసీమ అస్థిత్వంపై పోరాటం, అడ్డదిడ్డంగా పయనిస్తున్న యంత్రాంగాన్ని గాడిలో పెట్టడం, రాయలసీమకు అనువైన రాజకీయాలను నెరిపేందుకు నేతల్ని ఏకీకరణ చేయడం.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో విశేషాలు ఆయన సొంతం. రాయలసీమ కోసం దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి ఎంచుకున్న ఉద్యమపథం ఆదర్శనీయం. కలాన్ని కరవాలంగా ధరించిన ఆ పెద్దరికం కనుమరుగైంది.

- కడప జిల్లా సింహాద్రిపురం దగ్గర కోరుగుంటపల్లెలో సంపన్న కుటుంబంలో దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి జన్మించారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించిన ఆయన వారి తల్లిదండ్రులకు ఒకే ఒక కొడుకు. ఆయన ఎస్వీ యూనివర్సిటీలో ఆంగ్ల సాహిత్యంలో పీజీ చేశారు. 1978 లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో చేరారు. కొద్దిరోజులు బెంగుళూరులో పనిచేసి, కడప స్టాఫ్‌రిపోర్టర్‌గా దాదాపు 30 ఏళ్లు పనిచేశారు. ఆ తరువాత కొంతకాలం తిరుపతి, హైదరాబాద్‌లలో వివిధ హోదాల్లో పని చేశారు. జర్నలిస్ట్‌గా ఆయన ప్రస్థానంలో అనేక ఘటనలకు ఆయనే కేంద్ర బిందువుగా నిలవడం విశేషం.



దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి (ఫైల్)

ఎన్టీఆర్‌కు ఎదురుప్రశ్న..
ముఖ్యమంత్రి హోదాలో ఎన్టీ రామారావు జిల్లాలోని ముద్దనూరు పర్యటనకు వచ్చారు. అప్పట్లో రాయలసీమ వెనుకబాటు తనంపై ఉద్యమం బాగా నడుస్తోంది. ఆ పరిస్థితుల్లో జిల్లాకు వచ్చిన ఎన్టీఆర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. రాయలసీమలో సాగు, తాగునీటికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లుగా వివరిస్తూనే, శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఎన్ని కిలోమీటర్లు నీరు పారుదల చేయనున్నామో వివరించసాగారు. ఆ సందర్భంలో 'ఎక్స్‌క్యూజ్ మీ.. చిన్న డౌట్ సార్' అంటూ శ్రీనాథ్‌రెడ్డి గళం విప్పారు. 1 టీఎంసీ నీటికి ఎన్ని ఎకరాలు సాగుచేయవచ్చు సార్.. అంటూ ప్రశ్నించడంతో ఎన్టీఆర్ నోరెళ్లబెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో సందర్భంలో చింతకొమ్మదిన్నె సమీపంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రి హోదాలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన బహిష్కరించి 'మీట్ ది ప్రెస్' కార్యక్రమాన్ని అదే రోజు కడపలో అప్పటి విపక్షనేత వైఎస్ రాజశేఖరరెడ్డిచే ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడి హోదాలో శ్రీనాథ్‌రెడ్డి నిర్వహించడం విశేషం. దమ్మున్న జర్నలిస్టుగా ఆయనకు ఆయనే సాటి.

సంచలనంగా 'సెవెన్‌రోడ్స్ జంక్షన్'..
జర్నలిస్టుగా శ్రీనాథ్‌రెడ్డికి ఇంగ్లీషు, తెలుగు భాషలో విశేష నైపుణ్యం ఉంది. ప్రతిపదం అర్థవంతంగా.. ఆలోచనాత్మకంగా రాయడంలో ఆయన దిట్ట అని అప్పటి తరం జర్నలిస్టులు గుర్తుచేసుకుంటున్నారు. అప్పట్లో ప్రతి బుధవారం ఆంధ్రప్రభలో 'సెవెన్‌రోడ్స్ జంక్షన్' శీర్షికతో శ్రీనాథ్‌రెడ్డి కొన్ని ఏళ్లపాటు ఏకధాటిగా ప్రత్యేక కథనాలు రాసేవారు. అందులో ఇప్పటికీ గుర్తుండిపోయే వార్తలు చాలా ఉన్నాయి. వాటిలో.. ఇద్దరు పార్లమెంటు సభ్యుల గురించి 'ఆవు–దూడ'. ఎస్పీగా ఉమేష్‌చంద్ర పనితీరుపై 'ఎగిరిపడుతోన్న ఎర్రటోపీ' రాయచోటి ఉప ఎన్నికలపై 'రిగ్గుడు వాడే–నెగ్గుడు' ఇలాంటి దమ్మున్న శీర్షికలు ఎన్నో పెట్లారు.

ఉత్తర, దక్షిణ ధ్రువాలు సైతం....
ప్రజాస్వామ్య రాజకీయ నేతలు, పౌరహక్కుల నేతలు.. ఉత్తర దక్షిణ ధ్రువాలుగా 90వ దశకం కంటే ముందు ఉండేవారు. అలాంటి ఉత్తర, దక్షిణ ధ్రువాలకు దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి అనుసంధానకర్తగా నిలిచారు. అప్పట్లో జిల్లాలో క్రియాశీలకంగా పనిచేసిన న్యాయవాది కె. జయశ్రీపై రెండు తప్పుడు కేసులను పోలీసులు బనాయించారు. ఆ కేసులు తప్పుడు కేసులని.. జయశ్రీపై బనాయించడం ఏంటని ఎస్పీని శ్రీనాథ్‌రెడ్డి ధైర్యంగా ప్రశ్నించారు. ఆ తర్వాత ఆ కేసుపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

- పౌరహక్కుల నేత బాలగోపాల్ జిల్లా పర్యటనకు వస్తే శ్రీనాథ్‌రెడ్డితో చర్చించేవారు. రాయలసీమలో విభిన్న రాజకీయ పార్టీల నేతలు, వారి వారి రాజకీయ పరిమితులు ఎలా ఉన్నప్పటికీ శ్రీనాథ్‌రెడ్డి కార్యాలయంలో సమ ప్రాధాన్యత లభించేది.

నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు....
కడప జిల్లా జర్నలిస్టు దిగ్గజం. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి భౌతిక కాయం శుక్రవారం ఉదయం స్వగ్రామం కోరుగుంటపల్లెకు చేరనుంది. బంధువులు, సన్నిహితులు, ప్రజల సందర్శన అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

▶▶ రాయలసీమ ఉద్యమానికి కేరాఫ్ అడ్రస్....

రెండు దశాబ్దాలపాటు కడప శివలింగంపిళ్లై వీధిలోని శ్రీనాథ్‌రెడ్డి ఆఫీసు రాయలసీమ ఉద్యమానికి కేరాఫ్ అడ్రస్. రాజకీయ ఉద్దండులు వైఎస్ రాజశేఖరరెడ్డి, ఎంవీ రమణారెడ్డి, ఎంవీ మైసూరారెడ్డి, జేసీ దివాకరరెడ్డి, ఆర్. రాజగోపాల్ రెడ్డి మొదలుకుని.. రాయలసీమ ఉద్యమంతో ముడిపడిన అందరి తలలో నాలుకగా ఆయన నిలిచారంటే అతిశయోక్తి కాదు.

- రాయలసీమ నలుదిక్కుల నుంచి పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు వరకూ పాదయాత్ర చేపట్టాలనే కీలక నిర్ణయానికి రాజకీయ నేతలను ఏకీకరణ చేయడంలో ప్రధాన పాత్ర ఈయనదేనని నాటి ఉద్యమనేతలు వెల్లడిస్తున్నారు.
- ప్రస్తుత కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి అధ్యక్షుడుగా, కోఆపరేటివ్ కాలనీ ప్రతాప్‌రెడ్డి ప్రధాన కార్యదర్శిగా ఏర్పాటైన 'రాయలసీమ యువపోరాట సమితి' కూడా ఈయన కార్యాలయంలో పురుడు పోసుకుంది.

విలువలకు పెద్దపీట వేసిన శ్రీనాథ్‌రెడ్డి

వైవీయూ : విలువలకు పెద్దపీట వేస్తూ పాత్రికేయానికి సరైన అర్థంలా నిలిచిన సీనియర్ పాత్రికేయులు, ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి మృతి ఆవేదనకు గురిచేసిందని వైవీయూ వీసీ ఆచార్య జింక రంగజనార్ధన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, గజ్జల మల్లారెడ్డి ట్రస్ట్ కన్వీనర్ డా. ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. వైవీయూ ద్వారా గజ్జల మల్లారెడ్డి స్మారక పురస్కారం–2019ని ఆయన అందుకున్నారని గుర్తుచేశారు.

పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత ప్రయాణం



కడప కోటిరెడ్డిసర్కిల్: ఏప్రిల్ 3 నుంచి 18వ తేది వరకు జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థినీ విద్యార్థులు పరీక్షా కేంద్రంకు వెళ్లేందుకు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ పరీక్షల సందర్భంగా విద్యార్థులు తమ వద్ద బస్సు పాసు లేనప్పటికీ తమ ఒరిజినల్ హాల్ టిక్కెట్ కండక్టర్‌కు చూపి అన్ని పల్లె వెలుగు (ఆర్డినరి) బస్సులలో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షకు 882 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షకు సంబంధించి గణితం, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు 882 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 92 పరీక్షా కేంద్రాలలో 20,989 మంది విద్యార్థులకుగాను 20,107 మంది హాజరై 95.8 శాతంగా నమోదైంది. అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లి పరీక్షా కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు, లక్కిరెడ్డిపల్లె పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థి చూచి రాతలకు ప్రయత్నించడంతో మొత్తం ముగ్గురు విద్యార్థులను స్క్వాడ్ అధికారులు డిబార్ చేసినట్లు ఆర్ఐఓ రమణరాజు తెలిపారు. రాజంపేట ప్రాంతంలో ఆర్ఐఓ రమణరాజు, పులివెందుల ప్రాంతంలో డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులైన ప్రకాష్, వెంకటసుబ్బయ్య, ప్రసాద్‌వర్మ పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న రామగోవిందరెడ్డి, వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం : సిద్దయ్యమఠంలో పెద్ద పీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాల్లో రెండోరోజు గురువారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. 8 జతల ఎద్దులు పాల్గొన్నాయి.జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణ రెడ్డి పోటీలను ప్రారంభించారు. ప్రథమ బహుమతి కాశినాయనమండలం ఆనం వారిపల్లెకు చెందిన జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లు, ద్వితీయ బహుమతి చాగలమర్రి మండలం మూడురాళ్లపల్లెకు చెందిన పులి చిన్న ఓబుల్‌రెడ్డి ఎడ్లు గెలుపొందాయి.గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతుల కింద వరుసగా రూ.75116, రూ 50116, జెడ్పీటీసీ, సిద్దయ్యమఠం పీఠాధిపతులు అందజేశారు. కార్యక్రమంలో మఠం నిర్వాహకులు, ముడుమాల పంచాయతీ నాయకులు పాల్గొన్నారు.

బాల్యవివాహ యత్నానికి 'దిశ'చెక్ !

– విద్యార్థిని తల్లిదండ్రుల చేత ఒప్పంద ప్రమాణపత్రం

కడప అర్బన్ : కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ హైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్న విద్యార్థినికి పరీక్షలు కాగానే వివాహం చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో గురువారం విద్యార్థినిని పాఠశాల వద్ద వదిలి, వారు వైవీ స్ట్రీట్‌లో పెళ్లి బట్టల షాపింగ్‌కోసం వెళ్లారు. తాను చదువుకోవాలనుకుంటే తల్లిదండ్రులు వివాహప్రయత్నాలు చేస్తున్నారని విద్యార్థిని క్లాస్‌మేట్స్‌కు, టీచర్లకు తెలియజేసింది. ఈక్రమంలోనే ఇటీవల తమ పాఠశాలలో 'దిశ'పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది వచ్చి బాల్యవివాహాల నియంత్రణతో పాటు, మహిళలు, చిన్నపిల్లల పట్ల జరిగే నేరాల నియంత్రణపై అవగాహన సదస్సులను నిర్వహించిన విషయాన్ని గుర్తు చేసుకుంది. వెంటనే కడప 'దిశ'పోలీస్‌స్టేషన్ వద్దకు స్వచ్ఛందంగా వెళ్లింది. అక్కడి డీఎస్పీ వాసుదేవన్, సీఐ, ఎస్‌ఐలకు ఫిర్యాదు చేసింది. దీంతో వెంటనే స్పందించిన డీఎస్పీ విద్యార్థిని తల్లిదండ్రులను పిలిపించారు. తమ పరిధిలో బాల్యవివాహాలను చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామనీ చెబుతూనే, వారికి అవగాహన కల్పించారు. కౌన్సెలింగ్ నిర్వహించి కుమార్తెకు చేయాలనుకున్న బాల్యవివాహ ప్రయత్నాన్ని విరమించడంతో పాటు, పోలీసులకు ఒప్పంద ప్రమాణ పత్రాన్ని స్టేట్‌మెంట్ రూపంలో లిఖితపూర్వకంగా ఇచ్చారు. ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న సదరు వ్యక్తి, ఆయన భార్యకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వాసుదేవన్ మాట్లాడుతూ 'దిశ'ద్వారా విద్యాసంస్థల్లో బాల్యవివాహాల నియంత్రణ, మహిళలు, చిన్నపిల్లల పట్ల జరుగుతున్న, జరుగబోయే నేరాల గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈక్రమంలోనే విద్యార్థిని వచ్చి ఆమె పట్ల జరుగబోయే బాల్యవివాహ ప్రయత్నాన్ని తమకు చెప్పగలిగిందన్నారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ 'దిశ'టీమ్‌ను అభినందించారు.

'చాట్ బాక్స్'తో సులువైన సేవలు

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



బాధితుడికి సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : ప్రజలకు సులువైన సేవలు అందించడానికే చాట్ బాక్స్'ప్రారంభించామని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్'పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు వారి వారి సెల్‌ఫోన్ల రికవరీ చేసి అందజేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్న వారు తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండా, ఎఫ్ఐఆర్ నమోదు లేకుండా వాటిని వారికి తిరిగి అందజేయాలనే సంకల్పంతో గత ఏడాది డిసెంబర్ 1న మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం (ఎంఎంటీఎస్) ద్వారా ఉచిత వెబ్‌సైట్ సేవలు ప్రారంభించామన్నారు. ఈ విధానంలో ప్రజలకు మరింత సులువైన సేవలు అందించడానికి 'చాట్ బాక్స్'ద్వారా 93929 41541తో సేవలు ప్రారంభించామన్నారు. ఇప్పటివరకు 3600 మొబైల్స్ మిస్సింగ్ ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిల్లో ఎంఎంటీఎస్ ద్వారా 700 యాక్టివ్ మొబైల్స్‌ను గుర్తించామన్నారు. ప్రస్తుతం రూ. 60లక్షల విలువైన 215 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు ఎస్పీ చేతులమీదుగా అందజేశారు. దీంతో వారు 'థ్యాంక్యూ ఎస్పీ సార్'అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) తుషార్ డూడీ పాల్గొన్నారు. మొబైల్ ఫోన్ల రికవరీ కోసం శ్రమించిన ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, సైబర్ క్రైమ్ టెక్నికల్ విభాగం సీఐ వి. శ్రీధర్ నాయుడు, పులివెందుల ట్రాఫిక్ ఎస్ఐ డి. హాజీవల్లి, ఎస్ఐలు మధుమల్లేశ్వర్ రెడ్డి, రవికుమార్, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు. ప్రశంసాపత్రాలను అందజేశారు.

భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవం

రూ. 2.10 లక్షలు జరిమానా విధించిన ప్రొద్దుటూరు కోర్టు



నిందితుడు సయ్యద్ హుస్సేన్

ప్రొద్దుటూరు క్రైం : గర్భిణీ అయిన భార్యను రోకలి బండతో కొట్టి కిరాతకంగా హత్య చేసిన భర్త సయ్యద్ హుస్సేన్‌కు ప్రొద్దుటూరు రెండో అదనపు జిల్లా కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. 2014లో ప్రొద్దుటూరులోని మట్టిమసీదు వీధిలో ఈ సంఘటన జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు.. మట్టిమసీదు వీధికి చెందిన వక్కల సయ్యద్ హుస్సేన్‌కు చక్రాయపేటకు చెందిన సయ్యద్ అల్లాబకాష్ కుమార్తె సయ్యద్ యాస్మిన్‌తో 2010లో వివాహమైంది. వివాహ సమయంలో తల్లిదండ్రులు ఆమెకు ముస్లిం సంప్రదాయం ప్రకారం లాంఛనాలు, కట్నకానుకల కింద 10 తులాల బంగారు, రూ.40 వేల నగదు ఇచ్చారు. అయితే పెళ్లైన కొన్ని నెలల తర్వాత నుంచి అదనపు కట్నం కోసం ఆమెను భర్త హుస్సేన్ మానసికంగా, శారీరంగా వేధించసాగాడు. ఈ క్రమంలో 2014 ఫిబ్రవరి 22న ఏడు నెలల గర్భంతో ఉన్న యాస్మిన్‌ను రోకలి బండతో తలపై కొట్టి హత్య చేశాడు. మృతురాలి తండ్రి అల్లాబకాష్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు అదే రోజు కేసు నమోదు చేశారు. హత్య జరిగే నాటికి వారికి మూడేళ్ల కుమార్తె కూడా ఉంది. దర్యాప్తులో భాగంగా సయ్యద్ హుస్సేన్‌ను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. తగిన సాక్ష్యాలు లేనందున ఇదే కేసులో నిందితురాలిగా ఉన్న హుస్సేన్ తల్లి జైబున్నీసాను కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. నాటి నుంచి ప్రొద్దుటూరు రెండోఅదనపు జిల్లా కోర్టులో ఈ కేసు విచారణ జరుగుతూ వచ్చింది. తుది విచారణలో భాగంగా నేరం రుజువు కావడంతో నిందితుడు సయ్యద్ హుస్సేన్‌కు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ. 2.10 లక్షలు జరిమానా విధిస్తూ రెండో అదనపు జిల్లా కోర్టు జడ్జి జీ ఎస్ రమేష్‌కుమార్ గురువారం తీర్పు చెప్పారు. జరిమానా మొత్తాన్ని మృతురాలి కుమార్తెకు చెల్లించాల్సిందిగా తీర్పులో పేర్కొన్నారు. ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్ ఆధ్వర్యంలో కేసు విచారణకు సహకరించిన వన్‌టౌన్ సిబ్బందిని, ప్రాసిక్యూషన్‌లో బలమైన వాదనలు వినిపించి ముద్దాయికి శిక్ష పడేలా చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాంప్రసాద్‌రెడ్డిని జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

వ్యక్తి దారుణ హత్య

ప్రొద్దుటూరులో ఘటన



హత్యకు గురైన రాము (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని అమృతానగర్‌లో కురువ రాము (41) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. పండుగకు రావాలని సోదరుడు పిలవడంతో కుటుంబ సభ్యులతో కలిసి రాము అక్కడికి వచ్చాడు. ఈ క్రమంలో తెల్లారే సరికి శవమై రక్తపు మడుగులో పడి ఉన్నాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని కోనేటికాల్వ వీధిలో నివాసం ఉంటున్న కురువ రాముకు భార్య జ్యోతి, స్వప్న, స్వాతి అనే కుమార్తెలు ఉన్నారు. అతను మైదుకూరు రోడ్డులోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఒక చికెన్ సెంటర్‌లో గుమాస్తాగా పని చేస్తున్నాడు. అమృతానగర్‌లో ఉంటున్న అతని తమ్ముడు దేవర పండుగకు రమ్మని చెప్పడంతో బుధవారం భార్యా పిల్లలతో కలిసి రాము అక్కడికి వెళ్లాడు. రాత్రి బంధువులంతా కలిసి భోజనం కూడా చేశారు. తర్వాత రాము బయటికి వెళ్లాడు. రాత్రి పొద్దుపోయినా ఇంటికి రాలేదు. ఈ క్రమంలో గురువారం ఉదయం అమృతానగర్–3 లోని 18వ వీధిలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రాము మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. ఇంటి నిర్మాణం కోసం తోలిన ఇసుకలో అతని మృతదేహం పడి ఉంది. ఏఎస్పీ ప్రేరణకుమార్, టూ టౌన్ సీఐ ఇబ్రహీం, రూరల్ ఎస్ఐ సంజీవరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు రాము ముఖంపై గుర్తు పట్టని విధంగా కొట్టి గాయ పరిచారు. సంఘటనా స్థలాన్ని డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. రాత్రి 11 గంటల సమయంలో రాము ఫోన్‌లో మాట్లాడుతుండగా చూసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ సమయంలో అక్కడ ఏ చేస్తున్నావని వారు ప్రశ్నించగా తమ్ముని ఇంటికి పండుగకు వచ్చానని, దారి తెలియక ఇక్కడ తిరుగుతున్నానని అతను చెప్పినట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. అర్ధరాత్రి సమయంలో రాము హత్యకు గురై ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

ఫోన్‌లో బెదిరించిన వ్యక్తి ఎవరు..?

రాము పని చేస్తున్న చికెన్ సెంటర్‌లో మరో వ్యక్తి గుమాస్తాగా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి పొద్దుపోయాక ఒక వ్యక్తి అతనికి ఫోన్ చేసి బెదిరించినట్లు తెలుస్తోంది. 'వీధిలో అతను న్యూసెన్స్ చేస్తున్నాడు.. వచ్చి మీ ఫ్రెండ్ (రాము)ను పిలుచుకొని పోదురా.. లేదంటే కొట్టి ఆటోకు కట్టి పంపుతాం'అని అతను ఫోన్‌లో బెదిరించాడని సమాచారం. అతని ఫోన్ కాల్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి కీలకం కావచ్చని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

పిచ్చికుక్క దాడిలో చిన్నారికి తీవ్రగాయాలు

మదనపల్లె : పిచ్చికుక్క దాడిలో చిన్నారి తీవ్రంగా గాయపడిన సంఘటన అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలంలో జరిగింది. పెద్దతి ప్పసముద్రంకు చెందిన అంజి, సుశీల దంపతుల కుమార్తె దక్షిత(3) గురువారం ఇంటిముందు ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడిచేసి కరిచింది. తీవ్రంగా గా యపడిన దక్షితను కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యచికిత్స అనంతరం బాలిక కోలుకుంటోంది.

ప్రాణం తీసిన ఈత సరదా



గణేష్ మృతదేహం

పులివెందుల : ఈత సరదా యువకుడి ప్రాణం తీసింది.ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. పులివెందుల పట్టణంలోని యర్రగుడిపల్లెకు చెందిన లక్కె సుబ్బరాయుడు, సుబ్బమ్మల రెండో కుమారుడు గణేష్ స్నేహితులతో కలసి బ్రాహ్మణపల్లె గ్రామ సమీపంలోని బావిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈతరాని గణేష్ ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. స్నేహితుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. బావిలో నుంచి గణేష్‌ను వెలికి తీసి 108 వాహనంలో పులివెందుల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వంకలో ఇరుక్కుపోయి గేదె మృతి



గేదెను బయటికి తీస్తున్న స్థానికులు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడు సమీపంలోని నక్కలదిన్నె రోడ్డులో ఉన్న గుండ్లకమ్మ వంకలో గురువారం సాయంత్రం వంకలో ఇరుక్కపోయి గేదే మృతి చెందింది. చాపాడు దళితవాడకు చెందిన పల్లె దుర్గమ్మ రోజు మాదిరిగానే గేదేలను మేపుకునేందుకు పొలాల్లోకి తీసుకెళ్లింది. ఈ క్రమంలో ఓ గేదే నీటి కోసం వెళ్లగా ప్రమాదశాత్తు వంకలో ఓ చెట్టు వద్ద ఇరుక్కుపోయి ఊరిరాకడ మృతి చెందింది. గర్భంతో ఈ ఉన్న గేదే విలువ రూ.70వేలు అవుతుందని బాధితురాలు వాపోయింది. అధికారులు తనకు న్యాయం చేయాలని కోరుతోంది.

బైక్‌ల బోల్తా : ఇద్దరికి గాయాలు

మదనపల్లె : రోడ్డుపై కుక్క అడ్డుగా రావడంతో వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... బుధవారం రాత్రి అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం బూడిదవేడుకు చెందిన సుధాకరరెడ్డి(23) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. పొలానికి నీరు పెట్టేందుకు ద్విచక్రవాహనంలో బోరువద్దకు బయలుదేరగా, మార్గమధ్యంలో రోడ్డుకు అడ్డుగా కుక్క దూరడంతో అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడ్ని 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా వాల్మీకిపురం టౌన్ ఇందిరమ్మ కాలనీకి చెందిన వలీసాహెబ్ కుమారుడు ఎస్.రియాజ్(28) పాల ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. గురువారం వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో పుంగనూరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని వలసపల్లె జ్యూస్‌ఫ్యాక్టరీ వద్ద అకస్మాత్తుగా వాహనానికి కుక్క అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు.

షార్ట్‌సర్క్యూట్‌తో అరటి పంట దగ్ధం



కాలిపోయిన అరటితోట

తొండూరు : మండలంలోని ఊడవగండ్ల గ్రామానికి చెందిన మల్లేల ఈశ్వరయ్య అనే రైతుకు సంబంధించిన అరటి పంట విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో దగ్ధమైంది.20రోజుల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంట అగ్నికి ఆహుతి కావడంతో రైతు లబోదిబో మంటున్నాడు. ఐదెకరాల్లో అరటి సాగుచేయగా రూ.5లక్షలు ఖర్చు చేసినట్లు చెప్పాడు.. దీనిపై తొండూరు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు కూడా వచ్చి పరిశీలించారు.. స్థానిక వైస్సార్ సీపీ నాయకుడు దాసరి శశికాంత్‌రెడ్డి తోటను పరిశీలించారు. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని రైతుకు హామీ ఇచ్చారు.

ముఖ్యమంత్రికి ఘన సత్కారం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న నూతన ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఘనంగా సత్కరించారు. గురువారం అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, పి. రవీంద్రనాథ్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మేడా వెంకట మల్లికార్జునరెడ్డి, ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డిలతో కలిసి ముఖ్యమంత్రికి జ్ఞాపిక అందజేశారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. తనకు స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ పురోభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

జర్నలిస్టుల స్వతంత్రతను కాపాడాలి



కలెక్టర్ విజయ్ రామరాజుకు వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

కడప కార్పొరేషన్ : బడా కార్పొరేట్ సంస్థల బారి నుంచి మీడియాను కాపాడాలని, సంపాదకులు, జర్నలిస్టుల స్వతంత్రతను కాపాడాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పి. రామసుబ్బారెడ్డి కోరారు. గురువారం 'సేవ్ జర్నలిజం డే' సందర్భంగా వారు కలెక్టర్ విజయ్ రామరాజుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకొక్కుల ఇష్టాయిష్టాలకు లొంగని స్వతంత్ర జర్నలిస్టులు, మీడియా సంస్థల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసహన వైఖరి పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీకార రాజకీయల నుంచి ప్రకటనల జారీని తొలగించాలని, సమసమాజ స్థాపనకు కృషి చేస్తున్న జర్నలిస్టులపై యుఏపీఏ, దేశద్రోహం వంటి క్రూరమైన చట్టాలను ఆపాదించడం ఆపాలన్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ మీడియా అక్రిడిటేషన్ కమిటీలో అన్ని గుర్తింపు పొందిన జర్నలిస్టు యూనియన్ల ప్రాతినిధ్యాన్ని పునరుద్ధరించాలన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో జర్నలిస్టుల రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, రైల్వేలో రాయితీలను పునరుద్దరించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్రిడిటేషన్ ఇవ్వాలని, గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఇతర సౌకర్యాలను పునరుద్దరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపియూడబ్ల్యూజే నాయకులు వెంకటరెడ్డి, రామాంజనేయరెడ్డి, శివరాం, అంజనేయులు, నాగరాజు, శ్రీనివాసులు, సర్దార్ పాల్గొన్నారు.

రైలు కింద పడి గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న అధికారులు

వల్లూరు : మండల పరిధిలోని గంగాయపల్లె రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం సాయంత్రం రైలు కింద పడి గొర్రెలు మృతి చెందాయి. సీ కొత్తపల్లె, లింగాయపల్లె గ్రామాలకు చెందిన గొర్రెల కాపరులు ఎరికలయ్య, సుబ్బరాయుడు, మల్లయ్యలు మేపడం కోసం గొర్రెలను గంగాయపల్లె సమీపంలోని పొలాల్లోకి తోలుకెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వస్తూ రైల్వే ట్రాక్ దాటే క్రమంలో రైలు కింద పడి సుమారు 70 గొర్రెలు మృతి చెందాయి. సమాచారం అందుకున్న జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వై శారదమ్మ, జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకారం యూనియన్ చైర్మన్ అన్నం నాగ మల్లేశ్వరయ్య యాదవ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ వైద్యులు డా మారుతీ ప్రతాప్ పాల్గొన్నారు.

మనవడి స్కానింగ్ కోసం వెళ్లి..

లారీ కిందపడి మహిళ దుర్మరణం



మృతి చెందిన స్రవంతి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : మనవడికి స్కానింగ్ తీయించేందుకు వెళ్లి అవ్వ మృత్యు పాలైంది. స్థానిక మోడంపల్లె బైపాస్‌రోడ్డులో జూటూరు స్రవంతి (40) లారీ కింద పడి దుర్మరణం చెందింది. ఆమె భర్తతో కలిసి బైక్‌లో వెళ్తుండగా ఎదురుగా మరో బైక్ వచ్చి ఢీ కొంది. దీంతో ఆమె ఒక్కసారిగా ఎగిరి పక్కనే వెళ్తున్న లారీ కింద పడటంతో అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయింది. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు మైదుకూరు మండలంలోని వనిపెంట గ్రామానికి చెందిన జూటూరు సత్యనారాయణ మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆయన కుమార్తె హర్షితకు పెండ్లిమర్రికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్ శ్రీరాంసతీష్‌తో వివాహమైంది. వీరు బెంగుళూరులో ఉంటున్నారు. వారికి ఏడు నెలల కుమారుడు ఉన్నాడు. బంధువుల పెళ్లి ఉండటంతో నెల రోజుల క్రితం వారు పెండ్లిమర్రికి వచ్చారు. వారి ఏడునెలల కుమారుడికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వైద్యులు ఎమ్మార్ఐ స్కానింగ్ తీయించుకోమని సూచించారు. దీంతో స్రవంతి, సత్యనారాయణతో పాటు హర్షిత శ్రీరాంసతీష్‌లు బాబును తీసుకొని గురువారం సాయంత్రం ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి వచ్చారు. స్కానింగ్ తీయించుకోవడానికి బాబు సహకరించలేదు. దీంతో భార్యాభర్తలైన సత్యనారాయణ,స్రవంతిలు ఒక బైక్‌లో, బాబును తీసుకొని హర్షిత దంపతులు మరొక బైక్‌లో వనిపెంటకు బయలుదేరారు. ఈ క్రమంలో సత్యనారాయణ మోడంపల్లె బైపాస్ రోడ్డు గుండా వెళ్తుండగా సినీహబ్ వైపు నుంచి వచ్చిన భరత్‌కుమార్‌రెడ్డి బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో స్రవంతి బైక్‌లో నుంచి ఎగిరి పక్కనే వెళ్తున్న లారీ టైర్ల కింద పడటంతో మృతి చెందింది. తీవ్ర గాయాలైన సత్యనారాయణను కర్నూలు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ పుల్లన్న తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 40 కుటుంబాలు



సావిశెట్టిపల్లెలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కాశినాయన : మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామానికి చెందిన 40 కుటుంబాలు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మాజీ సర్పంచ్ మురికూటి క్రిష్టారెడ్డితో పాటు ఉగాది పండుగ రోజున టీడీపీ నుండి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వీరందరికీ ఎమ్మెల్సీ గోవిందరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా క్రిష్టారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ గోవిందరెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. రూ.20 కోట్లతో లిఫ్టుఇరిగేషన్ ద్వారా సావిశెట్టిపల్లె, వరికుంట్ల, బాలాయపల్లె, గొంటువారిపల్లె, గంగనపల్లె, ఇటుకులపాడు చెరువులకు నీరందించేందుకు టెండర్లు కూడా పూర్తయ్యాయని, త్వరలో పనులు మొదలు పెడతారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని ఆదరించాలని కోరారు. చంద్రశేఖర్‌రెడ్డి, బాలగురివిరెడ్డి, శివరామిరెడ్డి, చిన్నగురివిరెడ్డి, పోలిరెడ్డితో పాటు ఎస్సీ కుటుంబాల వారు పార్టీలో చేరారు.

■ కార్యక్రమంలో బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి, రంగసముద్రం సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, జెడ్పీటీసీ చెన్నయ్య, బి.కోడూరు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు సుదర్శన్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, ఈ.వి.సుబ్బారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.